సాక్షి వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



కేసులను వెంటనే పరిష్కరించాలి

ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారసంస్థల ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి అన్నారు. -8లో



సమర్థవంతంగా విధి నిర్వహణ.. నేరాల నియంత్రణ

జిల్లాలో పోలీస్‌శాఖ సమర్థవంతంగా పనిచేయడం వల్లే 2023లో నేరాలు గణనీయంగా తగ్గాయని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0/19.7

జిల్లాలో శనివారం 19.7- 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

9న సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం జనవరి 9వ తేది ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ముఖ్య కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

శ్రీ వీరభద్రస్వామి ఆలయ హోదా పెంపు



రాయచోటి టౌన్: దక్షిణకాశీగా వెలుగొందుతున్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్‌గా హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్వామి వారి నిత్య పూజలకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. స్వామి హుండీ ఆదాయం ప్రతి ఏడాది పెరుగుతూ వస్తోంది. 2010 నాటికి లక్షల్లోనే ఉండేది. ప్రస్తుతం వార్షికాదాయం రూ.5కోట్లకు పైగా వస్తోంది. దీంతో ఆలయానికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్థాయి నుంచి అసిస్టెంట్ కమిషనర్ స్థాయి హోదా కల్పించారు.

కౌశల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులకు మెమెంటోలను అందజేస్తున్న ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా శనివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్ పోటీలలో దొమ్మర నంద్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతిని కైవశం చేసుకున్నారు. వీరికి రూ. 12 వేలు నగదు, మెమెంటో, సర్టిఫికెట్‌లను ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి, శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి, విజ్ఞాన భారతి గవర్నింగ్ బాడీ సభ్యులు కొంపెల్ల శాస్త్రి, ఆంధ్రప్రదేశ్ వీవీపీ సామినేని ఉదయభాను చేతుల మీదుగా అందచేశారు. కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ విజయ మోహన్‌రెడ్డిని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి అభినందించారు.

కేవీఆర్‌తో వైవీయూ ఒప్పందం



ఎంఓయూ కుదుర్చుకుంటున్న వైవీయూ అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం, నెల్లూరు కేవీఆర్ సైంటిఫిక్ సర్వీసెస్ సాంకేతిక అంశాలపై మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. వీసీ ఆచార్య చింతా సుధాకర్ సమక్షంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.వి. శంకర్‌లు కేవీఆర్ సంస్థ ప్రతినిధులు కె. వెంకటేశ్వర్లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా సంస్థ నుంచి సాంకేతిక సహకారం లభిస్తుందన్నారు. తద్వారా వైవీయూ ఉన్నతవిద్యకు ఐటీ విషయాల్లో నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, పాలకమండలి సభ్యురాలు ఆచార్య పి.చంద్రమతీశంకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. టి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పండుటాకుల పరవశం

అవ్వాతాతలు గౌరవంగా జీవనం సాగించడానికి పింఛన్ సొమ్ము ఎంతో కొంత దోహదపడుతుంది. నూతన సంవత్సరం.. సంక్రాంతి పండుగల వేళ పింఛన్ పెంపు వారిలో ఆనందం నింపుతోంది. జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు పింఛన్లను దశల వారీగా రూ 3 వేలకు పెంచుతామని ప్రకటించారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక, ఇచ్చిన మాట ప్రకారం నగదును పెంచుతూ వచ్చారు. పెంచిన పింఛన్‌ను జనవరి 1వ తేదీ నుంచి అర్హులకు అందజేస్తారు.

- రూ 3 వేలకు పెరిగిన పింఛను
- జిల్లాలో 2,14,715 మందికి లబ్ధి



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న వలంటీర్ (ఫైల్)

కడప రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక కింద సామాజిక పింఛన్లకు సంబంధించి వృద్ధుల విభాగంలో అవ్వాతాతలతో పాటు వితంతువులు, దివ్యాంగులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చర్మకారులు, చేనేతలు ఉన్నారు. అందులో అధిక సంఖ్యలో వృద్ధులు ఉండగా తర్వాత వితంతువులు, అనంతరం మిగతా కేటగిరీకి చెందిన వారు ఉన్నారు. వీరందరికి పెరిగిన పింఛన్ వర్తిస్తుంది.

టీడీపీ పాలనలో రూ 1000 మాత్రమే....

టీడీపీ పాలనలో 2019 ఎన్నికలకు ముందు రూ 1000 రూపాయలు మాత్రమే పింఛన్‌ను అందజేసేవారు. ఇది గమనించిన జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పండుటాకులు గౌరవప్రదంగా జీవించడానికి రూ 2 వేలు ఇస్తామని ప్రకటించారు. దీంతో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆ 2 వేలు నేనే ఇస్తానని చెప్పి, ఎన్నికలకు ముందు కొద్ది నెలలు ఇచ్చారు. ఈ తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లను దశల వారీగా రూ 3 వేలు పెంచుతామని ప్రకటించారు. అనంతరం ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక సంక్షేమ పథకాలు పరుగులు తీశాయి. ఇచ్చిన మాట ప్రకారం దశల వారీగా పింఛన్ల సొమ్ము పెరుగుతూ వచ్చింది.

గతంలో అన్నీ ఇబ్బందులే..

చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియ అస్తవ్యస్తంగా సాగింది. అర్హులైన అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర కేటగిరీకి చెందిన వారు వ్యయ ప్రయాసాలకు ఓర్చి పింఛన్ల సొమ్ము ఇచ్చే ప్రాంతానికి వెళ్లేవారు. తీరా అక్కడికి వెళితే నగదు ఇవ్వడానికి మూడు నాలుగు రోజులు తిప్పుకొనే వారు. ఈ క్రమంలో కొందరు లబ్ధిదారులు నిరీక్షించలేక సొమ్మసిల్లి పడిపోయేవారు. అలాగే కొత్త పింఛన్ల పంపిణీ కూడా సక్రమంగా జరిగేది కాదు. దీంతో అర్హులైన వారు సైతం కొత్త పింఛన్లను పొందకుండానే మరణించేవారు.

నేడు పండుగలా పింఛన్ల పంపిణీ..

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక పింఛన్ల పంపిణీ పండుగలా సాగుతోంది. ఠంచన్‌గా 1వ తేదీనే నగదు అందుతోంది. దీంతో వృద్ధులు, దివ్యాంగులు సంతోషంగా ఉన్నారు. అలాగే ప్రభుత్వం ప్రతి ఏటా అర్హులైన వారికి జనవరి, జూలై మాసంలో కొత్త పింఛన్లను మంజూరు చేస్తున్నారు.

జిల్లాపై ప్రతి నెలా రూ 5.36 కోట్లకు పైగా భారం

జిల్లాలో మొత్తం 23 కేటగిరీలకు చెందిన పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. అందులో జనవరి 1వ తేదీ నుంచి ఏడు కేటగిరీలకు సంబంధించి ఒకరు రూ 2750కి బదులుగా రూ 3 వేల చొప్పున 2,14,715 మంది మొత్తం రూ 64,41,45,000 పొందుతారు. దీంతో జిల్లాపై ప్రతి నెలా 5.36 కోట్లకు పైగా అదనపు భారం పడుతుంది. అలాగే కొత్త పింఛన్ల మంజూరు కారణంగా మరింతగా అదనపు భారం పడనుంది.

▶▶రేపటి నుంచి 'వైఎస్సార్ పింఛన్ కానుక'

కడప రూరల్ : జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద జనవరి 1 నుంచి 8వ తేదీ వరకు నిర్దేశించిన ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు జరుగుతాయని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ తెలిపారు. సామాజిక పింఛన్ల పెంపుదలలో భాగంగా నెలవారి పింఛన్ మొత్తం రూ. 2750 నుంచి రూ. 3000కు పెరిగిందన్నారు. పంపిణీ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు.

తేదీల వారీగా పంపిణీ వివరాలు

పింఛన్ల పంపిణీ మండలాల వారీగా చేపట్టనున్నారు. 1వ తేదీన తొండూరు, 2న పెద్దముడియం, కలసపాడు, గోపవరం, బి.కోడూరు, దువ్వూరు, 3న చెన్నూరు, మైదుకూరు మున్సిపాలిటీ, ప్రొద్దుటూరు, ప్రొద్దుటూరు అర్బన్, జమ్మలమడుగు, లింగాల, మైదుకూరు, పులివెందుల మున్సిపాలిటీ, పులివెందుల, జమ్మలమడుగు మున్సిపాలిటీ, ఒంటిమిట్ట, వేంపల్లె, కడప అర్బన్, సిద్దవటం, 4న వేముల, సింహాద్రిపురం, సీకే దిన్నె, కాశినాయన, ఎర్రగుంట్ల, ఎర్రగుంట్ల మున్సిపాలిటీ, ఖాజీపేట, 5న ముద్దనూరు, బ్రహ్మంగారిమఠం, అట్లూరు, కమలాపురం, కొండాపురం, చక్రాయపేట, బద్వేలు, 6న పోరుమామిళ్ల, మైలవరం, చాపాడు, రాజుపాలెం, బద్వేలు మున్సిపాలిటీ, వల్లూరు, 7న పెండ్లిమర్రి, 8న వీరపునాయునిపల్లెలో పింఛన్ల పంపిణీ జరగనుంది.



అర్హులకు ఆర్థిక భరోసా



వైఎస్సార్ పింఛన్ కానుక కింద జనవరి 1వ తేదీ నుంచి ఒకరికి రూ 3 వేల చొప్పున పింఛన్ వస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్మును రూ 3 వేలకు పెంచారు. దీనివల్ల అర్హులకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది. కాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3వ తేదీన కాకినాడలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమాలు 8వ తేదీ వరకు జిల్లా అంతటా జరుగుతాయి.

– ఆనంద్‌నాయక్, ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

2న ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన

కడప సిటీ: బ్రహ్మంసాగర్ ఎడమకాలువ నుంచి కాశినాయన, కలసపాడు మండలంలోని పలు గ్రామాలకు నీటిని అందించే రెండు ఎత్తిపోతల పథకాలకు మంగళవారం శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడమకాలువలోని 42వ కిలోమీటరు వద్ద కలసపాడు మండలం తెల్లపాడు సమీపంలో ఉదయం 9 గంటలకు.. కాశినాయన మండలంలోని 32వ కిలోమీటరు గంగనపల్లె సమీపంలో 11 గంటలకు ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నీటిపారుదలశాఖ అధికారులు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. తెల్లపాడు వద్ద రూ. 16 కోట్లతో చేపడుతున్న ఈ పథకంతో తెల్లపాడు, రామాపురం, కొండపేట గ్రామాలకు, గంగనపల్లె వద్ద రూ. 32 కోట్లతో చేపడుతున్న ఎత్తిపోతల పథకంతో గంగనపల్లె, గొంటువారిపల్లె, బాలాయపల్లె, వరికుంట్లకు తాగు, సాగునీటి సౌకర్యం ఏర్పడుతుందన్నారు. రెండేళ్ల కిందట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయడంపై ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు



కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 31వ తేదీ ఆదివారం సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధావిధిగా పనిచేస్తాయని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు.

అందరి చూపు.. ఆ ఘడియ వైపు

2024



కడపలోని వైవీస్ట్రీట్‌లో జనసందడి



నగల దుకాణంలో కొనుగోలుదారులు

- మరికొన్ని గంటల్లో కాలగర్భంలో కలిసిపోనున్న మరో ఏడాది
- నయా జోష్‌కు మొదలైన కౌంట్‌డౌన్

కడప కల్చరల్/ రాజంపేట టౌన్: కులం, మతం, ప్రాంతం అన్న తేడా లేకుండా ప్రపంచమంతా ఉరకలేసే ఉత్సాహంతో జరుపుకునే ఏకైక వేడుక న్యూఇయర్. మరికొన్ని గంటల్లోనే ప్రపంచమంతా కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టబోతున్నాం. అదే సమయంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు, కొన్ని చేదు, విషాద సంఘటనలు కలగలిపిన 2023వ సంవత్సరం మరికొన్ని గంటల్లోనే కాలగర్భంలో కలిసిపోనుంది. కొత్త ఏడాది ఆగమనం అనగానే అందరిలోనూ ఆనందం తొణికిసలాడుతుంది. ఆ మధుర క్షణాన్ని ఆనందంగా ఆస్వాదించేందుకు ప్రజలు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జిల్లాలో మార్కెట్లు జన సందడితో కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, రెడీమేడ్‌షాపులు కిటకిటలాడాయి. వ్యాపారాలు జోరుగా సాగుతుండడంతో బజార్లు విక్రయ వేళల్లో రద్దీగా మారుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కేవలం నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి దాదాపు రూ. 25 కోట్ల వ్యాపారం జరగనున్నట్లు సమాచారం. ధరలు పెరిగినా కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా రోజంతా సంతోషంగా గడపాలన్న కోరికతో శక్తికి మించి ఖర్చు చేసేందుకు ప్రజలు వెనుకాడటం లేదు.

- కడప లోని వైవీ స్ట్రీట్ జనంతో కిటకిటలాడుతోంది. ప్రధానంగా దుస్తుల కొనుగోలుకే ప్రజలు ప్రాధాన్యత నిస్తున్నారు. దీంతో చిన్నా, పెద్ద దుకాణాల్లో సందడి కనిపిస్తోంది.. డైరీలు, గిఫ్ట్ దుకాణాలలో కూడా వ్యాపారాలు బాగా జరుగుతున్నాయి.
- న్యూఇయర్ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో యువకులు బైక్‌లను అతివేగంగా నడుపుతుంటారు. గతంలో బైక్ ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. 2017 డిసెంబర్ 31వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో రాజంపేట ఫైలోవర్ బ్రిడ్జిపై అతివేగంగా బైక్‌లు నడపడంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం ఉదాహరణగా చెప్పవచ్చు.

▶▶నిబంధనలు పాటించకపోతే చర్యలు

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా 31వ తేదీ రాత్రి నిబంధనలను పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం నుంచి జిల్లాలోని ప్రధాన రహదారుల్లో అతిగా మద్యం తాగి వాహనం నడపడం, చేయకూడదన్నారు. ప్రజలకు ఇబ్బంది కరంగా బహిరంగ ప్రదేశాలలో కేక్‌లు కట్ చేయడం వంటి పనులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

డాక్టరేట్ అందజేత

నందలూరు(రాజంపేట): ఆధ్యాత్మిక ప్రవచన కర్త, ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్‌కు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం తమిళనాడు రాష్ట్రంలోని హోసూరులో డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఆధ్యాత్మికం, దైవిక రంగంలో తాను గతంలో చేసిన సేవలను గుర్తిస్తూ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.



డాక్టరేట్‌ను అందుకుంటున్న పసుపులేటి శంకర్

28 నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

అన్నమయ్య జిల్లా డీఈఓ పురుషోత్తం

రాజంపేట టౌన్: వచ్చే ఏడాది జనవరి 28వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో 67వ జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు జరుగుతాయని అన్నమయ్య జిల్లా డీఈఓ పురుషోత్తం తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం పోటీల నిర్వహణపై రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని వివిధ మండలాలకు చెందిన ఎంఈఓలు, హెచ్‌ఎంలు, పీడీ, పీఈటీలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో డీఈఓ మాట్లాడారు. పోటీల నిర్వహణకు దాదాపు 20 కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కమిటీ తమకు అప్పచెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రాంతీయ వ్యాయామ విద్య తనిఖీ అధికారి (ఆర్‌ఐపీ) జి.భానుమూర్తిరాజు మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ ప్రతినిధులు చూడాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట, నందలూరు, పుల్లంపేట మండలాల ఎంఈఓలు కొండూరు రఘునాథరాజు, నాగయ్య, జి.చక్రధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ పురుషోత్తం

క్లుప్తంగా

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ములకలచెరువు : కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వైఎస్సార్ జిల్లా వాసులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక తెలిపారు. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం భగినెనాయక్ తాండాకు చెందిన ఈ.శ్రీను నాయక్(34), ఈ.తిరుపాల్ నాయక్(51) పల్సర్ బైక్‌లో కర్ణాటకకు చెందిన 80 టెట్రాప్యాకెట్లు బైకులో తెస్తుండగా పీటీఎం జింకలమిట్ట వద్ద శనివారం వేకువజామున అరెస్టు చేశామని తెలిపారు. కర్ణాటక మద్యం తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దాడిలో గాయపడిన మహిళ మృతి



కృష్ణవేణి(ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచగుడిపల్లి గ్రామంలో గల ఎస్సీ కాలనీలో ఈనెల 18న భర్త దాడి చేయడంతో గాయపడిన కృష్ణవేణి(38) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 18న రాచగుడిపల్లిలోని ఎస్సీకాలనీలో కృష్ణవేణిని ఆమె భర్త రామయ్య రోకలి కర్రతో తలపై కొట్టగా గాయపడింది. ఆమె తిరుపతిలో చికిత్స పొందుతూ శనివారం మరణించింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

కలసపాడు : మండలంలోని సింగరాయపల్లెకు చెందిన రెండు కుటుంబాలు బాకీ విషయమై ఘర్షణ పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ నాగమురళి తెలిపిన వివరాల మేరకు సింగరాయపల్లెకు చెందిన ఓసూరిశౌరి అదే గ్రామానికి చెందిన తలారి చిన్నయ్య వద్ద రూ.10 వేలు తీసుకుని బాకీ పడ్డాడు. డబ్బులు చెల్లించినా చెల్లించలేదని ఇరువురు గొడవ పడ్డారు. ఈ విషయమై ఇరువురి కుటుంబ సభ్యులు ఘర్షణ పడగా శౌరి, చిన్నయ్యలకు గాయాలయ్యాయి. చిన్నయ్య ఫిర్యాదు మేరకు శౌరి, మరో ఐదుగురిపై, శౌరి ఫిర్యాదు మేరకు చిన్నయ్య, మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె పంచాయతీ పెద్దమాదిగపల్లెకు చెందిన సురేష్ భార్య వై.గోపి(24) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది ఈగలమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సమర్థవంతంగా విధి నిర్వహణ ..

నేరాల నియంత్రణ



- ఎస్సీ,ఎస్టీ కేసుల్లో గత ఏడాదితో పోల్చితే 22శాతం తగ్గుదల
- సైబర్ నేరాలలో 14 శాతం ..
- మహిళలపై నేరాలు 6 శాతం తగ్గిన వైనం
- 2023 నేర సమీక్ష వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : జిల్లాలో పోలీస్‌శాఖ సమర్థవంతంగా పనిచేయడం వల్లే 2023లో నేరాలు గణనీయంగా తగ్గాయని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. శనివారం నేరాలకు సంబంధించిన సమీక్షను ఆయన పత్రికలకు విడుదల చేశారు. పోలీసింగ్‌లో వినూత్నమైన మార్పులు తీసుకురావడంతోనే ఇది సాధ్యమైందన్నారు. ద్విగుణీకృత ఉత్సాహంతో 2024లో మరింత మెరుగైన పోలీసింగ్‌తో ప్రజలకు ఉత్తమమైన సేవలు అందిస్తామన్నారు. గతంలో నమోదైన కేసులతో పోల్చుకుంటే ఎక్కువ స్థాయిలో నేరాలను నియంత్రించడంలో పోలీసులు సఫలీకృతులయ్యారన్నారు.

ప్రాపర్టీ నేరాల కేసుల్లో 26 శాతం తగ్గుదల

2022లో మొత్తం 407 ప్రాపర్టీ నేరాల కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 303 కేసులు నమోదై 26 శాతం తగ్గింది. ఇందులో రాత్రి దొంగతనాలకు సంబంధించి గత ఏడాది 124 నమోదుకాగా, 2023లో 78 కేసులుగా నమోదై 37 శాతం తగ్గుదలగా నమోదైంది. సాధారణ దొంగతనాలకు సంబంధించి 2022లో 252 కేసులు, 2023లో 195 కేసులు నమోదై 23 శాతం తగ్గాయి.

క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా, కోడిపందేలపై ముమ్మర దాడులు

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి దాడులను నిర్వహించి 943 కేసులు నమోదు చేసి 4453 మందిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.1,70,80,792 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి 13 కేసులను నమోదు చేసి 72 మందిని అరెస్ట్ చేశామన్నారు. 4260 కిలోల బరువున్న 194 దుంగలను, 18 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి విక్రయాలపై దాడులను ముమ్మరంగా నిర్వహించి 26 కేసులను నమోదు చేసి 172 మందిని అరెస్ట్ చేశామన్నారు. 310 కిలోల గంజాయి, 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

జిల్లాలో 8 మందిపై పి.డి యాక్ట్ ప్రయోగం

జిల్లాలో పదేపదే నేరాలకు పాల్పడుతున్న 8 మందిపై పి.డి.చట్టం ప్రయోగించామని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది 545 కేసులను నమోదు చేసి 679 మందిని అరెస్ట్ చేశామన్నారు. 3413 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

- ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక చట్టం) కేసులలో 22 శాతం తగ్గుదలగా నమోదయ్యాయి. 2022లో 147 కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 115 కేసులు నమోదయ్యాయి.

రోడ్డు ప్రమాదాల్లో 30 శాతం తగ్గుదల

జిల్లాలో రోడ్డు భద్రతా నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించడం, డ్రంకన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించడం వలన రోడ్డు ప్రమాదాలు గత ఏడాదితో పోల్చితే 30 శాతం తగ్గుదలగా నమోదైంది. గత ఏడాది మొత్తం 801 కేసులు కాగా, ఈ ఏడాది భారీగా తగ్గి 625 కేసులు నమోదయ్యాయి. ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలలో 2022లో 369, 2023లో 323 నమోదై 12 శాతం, సాధారణ ప్రమాదాల్లో 2022లో 432, 2023లో 302గా నమోదై 30 శాతం తగ్గుదలగా నమోదైంది. రోడ్డు ప్రమాదాల్లో మరణాల శాతం కూడా 9శాతం తగ్గుదలగా నమోదైంది. 2022లో 837 మంది గాయపడ్డారు. ఈ ఏడాది 722 మంది గాయపడ్డారు. 14శాతం తగ్గుదలగా నమోదైంది.

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎం.వి. చట్టం ప్రకారం 1,64,803 కేసులు నమోదు చేసి రూ.4,06,54,135 జరిమానా విధించారు.
- డ్రంకన్ డ్రైవ్‌లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై 1540 కేసులు నమోదు చేసి 1540 మందిని అరెస్ట్ చేశారు. డేంజరస్ డ్రైవింగ్ చేస్తున్న 545 మందిపై 545 కేసులు నమోదు చేశారు.
- గత ఏడాది 25 కిడ్నాప్ కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 16 కేసులు నమోదై 36 శాతం తగ్గుదలగా నమోదైంది.

మహిళలపై నేరాలు..

జిల్లాలో మహిళలపై నేరాలకు సంబంధించి 2022లో 732 కేసులు నమోదుకాగా, 2023లో 689 కేసులు నమోదై 6 శాతం తగ్గుదల ఉంది. ఇందులో వరకట్న హత్యలకు సంబంధించి గత ఏడాది 4 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఒక్క కేసు మాత్రమే నమోదై 75శాతం తగ్గుదలగా నమోదైంది. వరకట్న వేధింపు మరణాలు గత ఏడాది 7 కేసులు కాగా, ఈ ఏడాది 4 కేసులు నమోదై 42 శాతం తగ్గాయి. ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులు గత ఏడాది 15 కేసులు కాగా, ఈ ఏడాది 12 కేసులు నమోదయ్యాయి. 20 శాతం తగ్గాయి. మహిళల కిడ్నాప్ నేరాలకు సంబంధించి 2022లో 16 కేసులు, 2023లో 9 కేసులు నమోదయ్యాయి. 43 శాతం తగ్గాయి. మహిళలపై దౌర్జన్యం కేసుల్లో 2022లో 251 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 175 కేసులు నమోదయ్యాయి. 29 శాతం తగ్గుదల నమోదైంది. అత్యాచారయత్నం కేసులు 2022లో 8, 2023లో 8 కేసులు నమోదయ్యాయన్నారు.

- సైబర్ నేరాలకు సంబంధించి గత ఏడాది 83 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 71 కేసులు నమోదై 14 శాతం తగ్గుదల నమోదైంది.

హత్య కేసులు

- 2022లో 51 హత్య కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 49 నమోదయ్యాయి. 4 శాతం తగ్గుదలగా నమోదైంది. హత్యాయత్నం కేసుల్లో 20శాతం తగ్గుదల నమోదైంది. హత్యాయత్నం కేసుల్లో 2022లో 102, ఈ ఏడాది 82 నమోదై 20 శాతం తగ్గాయి.
- అత్యాచార కేసుల్లో 22శాతం తగ్గుదల... 2022లో 50 అత్యాచార కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 39గా నమోదై 22 శాతం తగ్గాయి.

చీటింగ్ కేసులు..

- 2022లో 218 చీటింగ్ కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 317 కేసులుగా నమోదయ్యాయి. 2022లో 582 మిస్సింగ్ కేసులు నమోదుకాగా, 526 మందిని ఆచూకీ కనుగొని తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఏడాది 562 కేసులు నమోదుకాగా 512 మంది ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు.

ఫాస్ట్‌ట్రాక్ కేసులు..

జిల్లాలో కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటుతో ఫాస్ట్ ట్రాక్ కేసులపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కేసుల విచారణ త్వరితగతిన జరిగి సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేస్తున్నారు. మొత్తం 550 కేసులను ఫాస్ట్ ట్రాక్ కేసులుగా గుర్తించగా అందులో 68 కేసుల్లో నేరస్థులకు సంబంధిత కోర్టులు శిక్ష విధించాయి. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన తీవ్రమైన 11 కేసుల్లో నిందితులకు కోర్టులో సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా పోలీసు అధికారులు సమష్టిగా కృషి చేశారు.

- లోక్ అదాలత్‌లో 2022లో 14344 కేసులను పరిష్కరించగా, ఈ ఏడాది దాదాపు రెట్టింపు కేసుల్లో 27,764 కేసులను పరిష్కరించారు.

గణనీయంగా నేరాలు తగ్గుదల



విజిబుల్ పోలీసింగ్, అసాంఘిక శక్తులపైనా నిఘా, అవగాహన కార్యక్రమాలను చేపట్టడం, పి.డి యాక్ట్ ప్రయోగం, నాటుసారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపడం, నేరాలకు శిక్ష పడే విధంగా పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించడం, గంజాయి కట్టడి వల్ల నేరాలు తగ్గుముఖం పట్టాయని జిల్లా ఎస్పీ వివరించారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

అమ్మ ఒడి ఎంతో ఊరట నిస్తోంది



జగనన్న ప్రవేశ పెట్టిన అమ్మ ఒడి పథకం మాకు ఎంతో ఊరట నిస్తోంది. మా భర్త వెల్డింగ్ పని చేయగా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నాం. జగనన్న వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వసతులు కల్పించడంతో పాటు అమ్మ ఒడి అందిస్తున్నారు. నాకు బాబు, పాప ఇద్దరు పిల్లలు. బాబు అలీ 8వ తరగతి. పాప రుఫైదా 5వ తరగతి. ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. ప్రైవేట్ బడుల్లో చదివించాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న విషయం. అయితే జగనన్న వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలే మారిపోయాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా చదివిస్తున్నారు. గతం కంటే ప్రస్తుతం మా పిల్లలు బాగా చదువుతున్నారు. ముఖ్యంగా జగనన్న ఇస్తున్న అమ్మ ఒడి పథకం ద్వారా మా కుటుంబానికి చాలా చేదోడు, వాదోడుగా ఉంది. జగనన్నకు జన్మంతా రుణపడి ఉంటాం.

-షేక్ హాజిమా, అక్సానగర్, కమలాపురం

సొంతింటి కల నెరవేరింది



నాది మండల కేంద్రమైన సింహాద్రిపురం. మేము ఎన్నో ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో బతికాం. జీవనం జరగడానికి కష్టంగా ఉన్న పరిస్థితులలో సొంతిల్లు ఉంటే అద్దె డబ్బులైనా మిగులుతాయనుకున్నాం.గత ప్రభుత్వంలో మా గోడు ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎలాంటి సిఫార్సు లేకుండా దరఖాస్తు చేసుకున్న వెంటనే వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి ఇంటి తాలూకు పట్టా ఇవ్వడంతో సొంతింటి కల నెరింది. సీఎం వైఎస్ జగన్‌కు మేము ఎప్పుడూ రుణపడి ఉంటాం.

- ముల్లా ముంతాజ్, సింహాద్రిపురం

ప్రజా వినియోగిత సేవలపై కేసులను వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి

కడప అర్బన్ : ప్రజా వినియోగిత సేవలపై ఆయా శాఖలకు వచ్చిన కేసులను వెంటనే పరిష్కరించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థల చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి పేర్కొన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి బాబా ఫక్రుద్దీన్‌ల ఆధ్వర్యంలో కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయసేవాసదన్‌లో ప్రజా వినియోగిత సేవలపై వివిధ శాఖల జిల్లా అధికారులకు అవగాహన, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు.. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం కాని కేసులను కూడా పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పర్మినెంట్ లోక్ అదాలత్ సభ్యులు ఎం.వి సుబ్బారెడ్డి, ఎం. ఆదినారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో

బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తా

ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది

కడప అగ్రికల్చర్ : జిల్లాలోని ఖాతాదారులు, ప్రజాప్రతినిధులు, బ్యాంకు సిబ్బంది అందరి సహకారంతో డీసీసీ బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని డీసీసీ బ్యాంక్, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. శనివారం కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరలో డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బందితో కలిసి 2024 సంవత్సరానికి సంబంధించిన నూతన క్యాలెండర్, డైరీలను ఆమె ఆవిష్కరించారు. ముందుగా ఆమె ఖాతాదారులు, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బందికి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో 30 ఏళ్ల నుంచి నష్టాల బాటలో ఉన్న డీసీసీ బ్యాంకును లాభాల బాటలోని తెచ్చామన్నారు. ఇక సొసైటీలను కూడా లాభాల బాటలో నడిపించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే లింగాపురం, ఎల్లటూరులలో గోడౌన్లను నిర్మించి రైతులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. త్వరలో జిల్లాలో బి.మఠం, ఎర్రగుంట్ల, రామేశ్వరం, ముద్దనూరులలో నూతన బ్రాంచులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీసీసీ బ్యాంకులో రూ.లక్ష డిపాజిట్ చేసిన వారికి రూ. 5 లక్షల వరకు ఎడ్యుకేషన్ లోన్ ఇస్తున్నామన్నారు. డీసీసీ బ్యాంకు పరిధిలో అన్ని రకాల రుణాలు కలిపి రూ. 2968 కోట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు వీరారెడ్డి, ఆంజనేయులు, వెంకటసుబ్బయ్య, గంగాధర్, బ్యాంకు సలహాదారు సహదేవ రెడ్డి, జీఎం రాజామణి, డీజీఎం బాలిరెడ్డిలతోపాటు పలువురు బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్వారకానగర్‌కు చెందిన నిమ్మకాయల ప్రవీణ్‌కుమార్ రెడ్డి (40) అనే వ్యక్తి ఈనెల 19న విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు.

మొదట ఈనెల 14న ఇంటిలో చెప్పకుండా వెళ్లిపోయాడు. అతని సోదరి హిమబిందు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అతను ఈనెల 19న విషద్రావణం తాగానని, కడప నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం ఇవ్వడంతో సోదరి హుటాహుటిన వెళ్లింది. ఆ రోజు నుంచి చికిత్స చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆర్థిక, కుటుంబ సమస్యలతో ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ సంఘటనపై కడప ఒన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి కేసు నమోదు చేశారు.

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపల్, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో అనంతపురం జేఎన్‌టీయూ స్పోర్ట్స్ సెక్రటరీ జోజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీలకు అనంతపురం జేఎన్‌టీయూ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి 150మంది క్రీడాకారులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు సేలం పెరియార్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. అలాగే కేరళ రాష్ట్రంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో మార్చి రెండవ వారంలో జరిగే టోర్నమెంట్‌లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ సూర్యనారాయణరెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

కట్టుదిట్టంగా ఏహెచ్‌ఏ పరీక్షలు

కడప సెవెన్‌రోడ్స్ : ఈనెల 31వ తేదీ జరిగే అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ నియామక పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 8.00 నుంచి 9.00 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు ఏర్పాట్లు చేయాలని పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, ఏపీఎస్పీ డీసీఎల్ అధికారులకు సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, పరీక్షా కేంద్రాల యాజమాన్యం, పోలీసుశాఖ సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి కేంద్రంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత పరీక్షా కేంద్రాల యాజమానులదేనన్నారు. కడపలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, కడప, శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల, కడప, కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల కడప, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, ప్రొద్దుటూరులోని సాయి రాజేశ్వరి, చైతన్య భారతి కళాశాలల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

హంద్రీనీవా కాలువలో పడి విద్యార్థి మృతి

మదనపల్లె : హంద్రీనీవా కాలువలో పడి ప్రమాదవశాత్తు ఓ విద్యార్థి మృతిచెందిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండ పంచాయతీ డీఎస్పీ బంగ్లా వెనుక రామాలయం వీధిలో నివాసం ఉన్న ఆటోడ్రైవర్ చంద్రకుమారుడు సి.అక్షయ్(18), పట్టణంలోని వెంకటరెడ్డి సిద్ధార్థ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ప్రీ ఫైనల్ పరీక్ష అనంతరం పుంగనూరుకు చెందిన అతని స్నేహితుడు హర్షిత్‌కు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన షూస్ ఇవ్వాల్సి ఉండటంతో ఇద్దరు కలిసి ఇంటికి వచ్చారు. ఇంటికి తాళాలు వేసి ఉండటంతో, మరో స్నేహితుడు లోహిత్ ఇంటికి వెళ్లారు. ముగ్గురు కలిసి వడ్డిపల్లె సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకున్నారు. కాలువ గట్టున కూర్చుని సరదాగా ఫొటోలు తీసుకుంటుండగా, ఈ క్రమంలో కాలుజారి ప్రమాదవశాత్తు అక్షయ్ కాలువలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మృతి చెందాడు.

సీఎంను విమర్శించే అర్హత బీటెక్ రవికి లేదు




మీడియాతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : టీడీపీ నాయకుడు బీటెక్ రవికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నూర్ బాషా, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ రసూల్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీటెక్ రవి తన ఉనికి కాపాడుకునేందుకు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. అది సరి కాదన్నారు. నక్కకు నాగలోకానికి ఉన్న తేడా బీటెక్ రవిది అని.. అలాంటి వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మీద పోటీకి సిద్ధమని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సింహాద్రిపురంలో వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని నీవు ఇలా ఎలా మాట్లాడుతున్నావని ప్రశ్నించారు. ప్రభుత్వం తనకు గన్‌మెన్లను తొలగించిందని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ప్రజాప్రతినిధులకు మాత్రమే గన్‌మెన్లు ఉంటారనే విషయం తెలియదా అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని విమర్శించే రవికి సింహాద్రిపురం మండలంలో జరిగిన అభివృద్ధి కనిపించలేదా అని అడిగారు. ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు నీవు ఏమైనా అభివృద్ధి చేశావా అని నిలదీశారు. బెట్టింగ్‌లు, జూదం, అసాంఘిక కార్యకలాపాల్లో గొడవలకు దిగడంతో ప్రాణహాని ఉందంటూ నీ రక్షణ కోసం గన్‌మెన్‌ను కోరుతున్నావే తప్ప.. వేరే ఉద్దేశం లేదన్నారు. పులివెందులలో వైఎస్ కుటుంబంతో ప్రాణ హాని ఉందని చెప్పడం సరికాదన్నారు. హత్యా రాజకీయాలను రూపుమాపిన ఘనత వైఎస్ కుటుంబానికి దక్కుతుందన్నారు. నీవు ఒంటరిగా వెళ్లినా ఎలాంటి భయం అక్కర్లేదన్నారు. ఇక మీదట సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే నియోజకవర్గ ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జిలు చంద్రమౌళి, పార్నపల్లె కిశోర్, కో.ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధురెడ్డి, బాషా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా గెలిచే సత్తా ఉందా

సింహాద్రిపురం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



మీడియాతో మాట్లాడుతున్న సింహాద్రిపురం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాద్రిపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల గురించి మాట్లాడే అర్హత బీటెక్ రవికి లేదని మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సింహాద్రిపురం మండల నాయకులు బీఎన్ బ్రహ్మానందరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, ప్రహ్లాదరెడ్డి, మల్లికార్జునరెడ్డి, చెన్నకేశవరెడ్డి, శాలివాహనరెడ్డి, శివశంకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సింహాద్రిపురంలో వారు విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సింహాద్రిపురానికి ఏమి చేశారో చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితిలో టీడీపీ నేతలు ఉన్నారన్నారు. కనీసం సొంతూరికి ఏమి చేశాడో చెప్పుకోలేని దీనస్థితి బీటెక్ రవిది అన్నారు. సింహాద్రిపురంలో సీఎం వైఎస్ జగన్ పర్యటనలో జనం పోటెత్తినా కళ్లున్నా చూడలేని కబోది బీటెక్ రవి అని దుయ్యబట్టారు. పెద్దోళ్లను విమర్శించడం ద్వారా తాను కూడా పెద్దోడినని భ్రమలో ఆయన ఉన్నారని విమర్శించారు. జగన్‌పైన పోటీ అని చెప్పుకుంటూ పంచాయితీలు చేసుకోవడం తప్పా నిజంగా నీకు దమ్ముంటే పులివెందుల నియోజకవర్గంలో ఏ గ్రామమం నుంచైనా ఒక్క పంచాయతీకి పోటీ చేసి గెలిచే సత్తా నీకు ఉందా అని సవాల్ విసిరారు. పులివెందులలో టీడీపీ తరపున పోటీ చేసే అభ్యర్థి ఎవరూ దొరకక ఆ పార్టీ నిన్ను భరిస్తోందన్నారు.